క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

ఏర్పేడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిడ్డయ్య బుధవారం అన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి



మాట్లాడుతున్న ఎంఈవో దయాకర్

ఏర్పేడు: విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని ఎంఈఓ దయాకర్ తెలిపారు. ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అభ్యసనా సామర్థ్యాలు, గణితంలోని మెలకువలపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయుడు కీలకమని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సునీత, నిర్మల్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక దళితవాడలో సర్పంచ్ గంగాధరం, తిరుపతి ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మేర్లపాక, ఎస్సీ కాలనీ, మన్నసముద్రం, ఏర్పేడు తదితర గ్రామాల నుంచి వచ్చిన 80 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భరత్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలు



భూమి పూజలో పాల్గొన్న పవిత్రా రెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): గ్రామాల్లో దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్‌సీపీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రా రెడ్డి అన్నారు. మండలంలోని బోనుపల్లి పంచాయితీ ఎర్రమిట్ట గ్రామంలో బుధవారం శ్రీ కృష్ణమందిరం భూమి పూజ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామస్తులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధయ్య, ఎంపీటీసీ రవీంద్రనాయుడు, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య నాయుడు, నాయకులు దాము నాయుడు, రామనాయుడు, మురళి పాల్గొన్నారు.

ఘనంగా 'రక్షాబంధన్'

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో బుధవారం రక్షాబంధన్ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. అక్కచెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీలు కట్టి ఆశీస్సులు పొందారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. అన్నదమ్ములు నిండూనూరేళ్లు జీవించి, సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భవతులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: గర్భవతులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకుని, పుట్టబోయే శిశువు ఆరోగ్య గురించి తెలుసుకోవాలని వైద్యాధికారిణి మాధవి, వైద్యులు దివాకర్ తెలిపారు. బుధవారం గర్భవతులకు స్థానిక పీహెచ్‌సీలో వారు వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గర్భవతులు పాల్గొన్నారు.

హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు: సత్యవేడు ఐసీడీఎస్ పరిధిలో సత్యవేడులో–1, వరదయ్యపాళెంలో4 హెల్పర్ పోస్టులు ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ దేవకుమారి తెలిపారు. సెప్టెంబర్ 11వ తేదీలోపు దరఖాస్తులు తమ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఖాళీల వివరాలు... సత్యవేడు మండలంలో రాచపాళెం, వరదయ్యపాళెం మండలంలో.. కడూరు, ఆర్‌ఆర్‌పాళెం, కారిపాకం–1, పులివెల్లం అంగన్‌వాడీ కేంద్రాల ఆయా పోస్టులకు స్థానిక వివాహిత మహిళలు అర్హులని తెలిపారు.

బోగస్ ఓట్ల తొలగింపులో పారదర్శకత



కలెక్టర్ వెంకటరమణారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: సత్యవేడు నియోజకవర్గంలో బోగస్ ఓట్లను తొలగించడంలో పారదర్శకత పాటించాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. బుధవారం మండలంలోని పాలమంగళం ఉత్తరపుకండ్రిగలో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో కొందరి ఇళ్లకు వెళ్లి ఆయనే స్వయంగా విచారణ చేశారు. కలెక్టర్‌ను ఎమ్మెల్యే కలిసి నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సరిహద్దు నియోజకవర్గం కావడంతో తమిళనాడులో నివాసముంటూ, అక్కడే వివాహమాడి, స్థిరపడిన వారందరూ సత్యవేడులో ఓటర్లుగా ఉన్నారని, ఎక్కడో ఉంటున్న వారిని రెవెన్యూ సిబ్బంది ఎలా ఓటర్లుగా నమోదు చేయిస్తారని ప్రశ్నించారు. రెవెన్యూ శాఖ పారదర్శకంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, తమిళనాడు వాసుల పేర్లను తొలగించాలని కలెక్టర్‌ను కోరారు. నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ, కొత్త రోడ్ల ఏర్పాటు, దాసుకుప్పం బైపాస్‌రోడ్డు ఫైల్స్‌ను త్వరితిగతిన క్లియర్ అయ్యేలా చొరవ చూపాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. స్పందించిన కలెక్టర్ త్వరలో నియోజకవర్గంలోని రోడ్లను పరిశీలించి, నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు సాయిరవి, ప్రేమలత తదితరులు ఉన్నారు.

తొలగించిన ఓట్లను పరిశీలించిన కలెక్టర్



పిచ్చాటూరులో తొలగించిన ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

పిచ్చాటూరు: తొలగించిన ఓట్లను జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. బుధవారం ఓటర్ల జాబితాతో కలెక్టర్ మండలంలోని నీరువాయి గ్రామానికి వెళ్లి పరిశీలించారు. ఓటు తొలగించిన వ్యక్తి జీవించి లేడని కుటుంబ సభ్యులు చెప్పడంతో వాస్తవమేనని నిర్ధారించుకున్నారు. ఆ తర్వాత బజారు వీధిలో శేఖర్ గుప్త ఓటు తొలగించి ఉన్నారని కుటుంబ సభ్యులను అడుగగా అతను మరణించారని సమాధానం ఇచ్చారు.

చెరకు బకాయిలు ఇప్పించండి సార్

నేటమ్ షుగర్ ఫ్యాక్టరీ తమకు ఇవ్వవలసిన బకాయిలను ఇప్పించాలని నీరువాయి గ్రామ రైతులు కలెక్టర్‌ను కోరారు. ఏళ్ల తరబడి బకాయిలు చెల్లించక ఇబ్బంది పెడుతున్న ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం : మండల కేంద్రంలోని పోలింగ్ బూత్ పరిధిలో తొలగించిన ఓటర్లకు సంబంధించి కలెక్టర్ వెంకటరమణారెడ్డి విచారణ చేశారు. తమిళనాడులో నివాసం ఉంటూ ఆంధ్రాలో ఓటు హక్కు కలిగినవారు నగరి, సత్యవేడు నియోజకవర్గాలో ఉన్నారని సమాచా రం. ఈ నేపథ్యంలో మండలంలోని ఈస్ట్ దళితవాడ లో ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల జాబితాలో ఉన్న పేర్లు గల వారు స్థానికంగా ఉన్నారా, లేరా? ఆరా తీశారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రసన్న కుమార్, వీఆర్‌ఓ నాగభూషణం, ఇన్‌చార్జ్ ఎస్‌ఐ పురుషోత్తం రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకుంటాం



మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 10వేలను అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: మండలంలోని ముస్లింపాళెంలో ఈ నెల 27న విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఊత్తుకోట హసీం కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భరోసా ఇచ్చారు. బుధవారం సాయంత్రం ముస్లింపాళెంలోని హసీం ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కరెంటు షాక్‌కు గల కారణాలను, ప్రమాదం జరిగిన తీరును ఎమ్మెల్యే పరిశీలించారు. మృతుని కుటుంబానికి తక్షణ సాయంగా రూ. 10వేలను అందజేశారు. అనంతరం ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని, శాఖాపరంగా కసాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, కో–ఆప్షన్ సభ్యుడు సిద్ధిక్, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి లతీఫ్, డైరెక్టర్ అబ్దుల్, స్థానిక సర్పంచులు అలీ, దుద్దు వేణు, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఓడూరు ఉజ్వల్ రెడ్డి, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, సీనియర్ అసిస్టెంట్ మురళి, ట్రాన్స్‌కో ఏఈ శివప్రసాద్, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది రాజేశ్వరావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జి ఆదేశాల మేరకు బుధవారం న్యాయవాది రాజేశ్వరరావు మండలంలోని టీఎంవీ కండ్రిగవాసులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మూడేళ్ల ముందే టీఎంవీ కండ్రిగను మోడల్ విలేజ్‌గా ఎంపికచేసినట్లు గుర్తుచేశారు. అప్పటి నుంచి ఈ గ్రామంలో ఏ సమస్యలూ లేవన్నారు. గ్రామ సచివాలయ పరిధి లో ఏవైనా సమస్యలు ఉంటే అర్జీ రూపంలో న్యాయమూర్తికి అందిస్తే తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి హేమశ్రీ, పారా లీగల్ వలంటీ ర్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి



సీఎల్‌ఎన్‌పల్లెలో ఈ–క్రాప్ నమోదుపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సుబ్రమణ్యం

వరదయ్యపాళెం: ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని సత్యవేడు వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్రమణ్యం కోరారు. బుధవారం మండలంలోని సీఎల్‌ఎన్‌పల్లె, కళత్తూరు, అంబూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆ గ్రామాల్లో చేస్తున్న ఈ–క్రాప్ నమోదును పరిశీలించారు. అలాగే స్థానిక రైతులతో సమావేశమై ఈ–క్రాప్ నమోదు ప్రాముఖ్యతను వివరించారు. వ్యవసాయశాఖకు సంబంధించి అమలయ్యే అన్ని రకాల పథకాలకు ఈ–క్రాప్ నమోదు అనుసంధానం చేస్తారన్నారు. ఈ ప్రాతిపదికనే వ్యవసాయశాఖ ద్వారా పథకాలకు అర్హత పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏవో సుహార్‌లత, విస్తరణాధికారి నవీన్, వ్యవసాయ సహాయకులు పవన్, జ్యోతి పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ వెంకటేష్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరులో బుధవారం మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేష్ గ్రామస్తులకు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ గ్రామంలో ఒక కుష్టు కేసు నమోదు కావడంతో ఆయన అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఎవరైనా కుష్టు లక్షణాలతో బాధపడుతున్నారా? అన్నది పరిశీలించాలన్నారు. శరీరంపై రాగివర్ణం, స్పర్శ లేని, నొప్పి, దురదలేని మచ్చలుంటే మండల ప్రభుత్వాసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. కుష్టు వ్యాధి నివారణకు ప్రభు త్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తుందని, క్రమం తప్పకుండా మందులను వాడితే వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చన్నారు.

రూ.5లక్షల బీమాతో భరోసా



మృతుడి కుటుంబీకులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: మండలంలోని సూర్యనారాయణపురానికి చెందిన సురేష్ ఈ నెల 9వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం అందించారు. కుటుంబీకులు మాట్లాడుతూ తమ బిడ్డ మృతి చెంది 20 రోజులు గడవకముందే ప్రభుత్వం పెద్ద సాయం అందించిందని కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే ఆదిమూలం మేలును మరువలేమని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

నిందితుల అరెస్ట్‌లో జాప్యం ఎందుకు?



విలేకరులతో మాట్లాడుతున్న మృతుడి కుటుంబ సభ్యులు

సత్యవేడు: మండలంలోని రాచపాళెం దళితవాడకు చెందిన మన్నార్ కుమార్ మృతికి కారకులైన నిందితుల్ని అరెస్టు చేయడంలో శ్రీసిటీ పోలీసులు జాప్యం చేస్తున్నారని మృతుడు భార్య గౌరి ఆరోపించారు. బుధవారం సాయంత్రం సత్యవేడు ప్రెస్ క్లబ్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి బాధిత కుటుంబీకులు మాట్లాడారు. ఈ ఏడాది ఫిబ్రవరి27న తన భర్తను ఆరుగురు చంపేందుకు ప్రయత్నించారని శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఆ తర్వాత చెన్నైలో చికిత్స పొందుతూ మార్చి 4న మన్నార్ మృతి చెందాడని తెలిపారు. అయితే పోలీసులు మాత్రం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయడంలో ఔచిత్యమేమిటని ప్రశ్నించారు. నిందితులను అరెస్టు చేయాలని ఆరునెలల కాలంలో పలుమార్లు ఆందోళన చేసినా స్పందించలేదని, పైగా నిందితులు కొమ్ముకాస్తూ, డబ్బులిప్పిస్తామని బేరసారాలు చేస్తున్నారని ఆరోపించారు. విసిగి వేసారిన తాము నగరిలో సీఎం సభకు వెళ్లి తమ గోడు చెబుతామంటే శ్రీసిటీ పోలీసులు వెళ్లొద్దని చెప్పారని అన్నారు. ఇకనైనా తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరారు. సమావేశంలో మృతుడి కుటుంబ సభ్యులు ఆదిలక్ష్మి, అర్చన, హారిక, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అరుణాచలం, సీపీఎం మండల కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు ఇప్పించి న్యాయం చేయండి

తిరుపతి కల్చరల్: కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసిన ఇంటిని ఇప్పించి న్యాయం చేయాలని ఎన్‌ఆర్‌ఐ సాయిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. శ్రీవారి పాదాల చెంత ఇల్లు కట్టుకోవాలని రేణిగుంట మండలం కొత్రమంగళం వద్ద నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనంలో ఓ ఇంటిని రూ.30 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశానని తెలిపారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు సంబంధిత సంస్థ యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. ఇలా 250 మందికి కూడా అన్యాయం చేస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

దేశమ్మ ఆలయ గుత్తహక్కుల ఆదాయం రూ.5.85 లక్షలు

నగరి: దేశమ్మ ఆలయానికి గుత్తహక్కుల వేలం ద్వారా రూ.5.85 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు అన్నారు. బుధవారం ఆలయ ఆవరణలో గుత్తహక్కులకు వేలం పాట నిర్వహించారు. అమ్మవారి కీచైన్లు, దారాలు, ఫొటోలు అమ్ముకునే హక్కుకు రూ.లక్ష, భక్తులు సమర్పించే చీరలు, జాకెట్లు పోగుచేసుకునే హక్కుకు రూ. 1.10 లక్షలు, సజీవ కోళ్లు పోగుచేసుకునే హక్కుకు రూ.లక్ష, వాహన రుసుము వసూలు చేసుకునే హక్కుకు రూ.1.60 లక్షలు, దుకాణంలో కూల్‌డ్రింక్స్, టీ, కాఫీ, బజ్జీ, బోండా అమ్ముకునే హక్కుకు రూ.1.15 లక్షలు చొప్పున వేలం పాటలో కేటాయించారు. దీంతో ఆలయానికి రూ.5.85 లక్షల ఆదాయం లభించింది. గత ఏడాది రూ.4.56 లక్షలు ఉన్న ఈ గుత్తహక్కుల ఆదాయం ఈ ఏడాది రూ.1.29 లక్షలు పెరిగిందని చైర్మన్ తెలిపారు. తలనీలాల హక్కు వేలం వాయిదా వేశామన్నారు. ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో సేవలను వినియోగించుకోండి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా సహకార బ్యాంకు సూపర్‌వైజర్ సుధీర్‌రెడ్డి

నారాయణవనం: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్)ల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార బ్యాంకు సూపర్‌వైజర్ సుధీర్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో డిజిటల్ చెల్లింపులపై రైతులకు కళాజాతతో అవగాహన కల్పించారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపులు అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా ఉంటాయన్నారు. పీఏసీఎస్‌లలో డిజిటల్ చెల్లింపులకు రైతులు చొరవ చూపాలని కోరారు.

తక్కువ వడ్డీకి భూమి, ఇంటి తనఖా, బంగారు రుణాలను ఇస్తున్నామని అన్నారు. అలాగే నాణ్యమైన ఎరువులను, విత్తనాలను పరపతి సంఘాల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు మనోహర్, హేమచంద్రారెడ్డి, కార్యదర్శి పార్థసారథి, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మహిళలు





ఎమ్మెల్యేకు రాఖీలు కడుతున్న మహిళలు, మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి మహిళలు పెద్ద ఎత్తున చేరుకుని ఎమ్మెల్యేకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమమే లక్ష్యంగా వారి రక్షణే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారని గుర్తుచేశారు. ఆయన మార్గంలోనే నడుస్తూ, ఒక అన్నగా, తమ్ముడిగా నియోజకవర్గంలో మహిళలందరికీ అండగా ఉంటామని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం రాఖీ కట్టిన మహిళలందరికీ కానుకగా చీరలు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

కనుల పండువలా ఊంజల్ సేవ



ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్‌సేవ కనుల పండువలా సాగింది. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపుగా ఊంజల్‌సేవ మండపానికి తీసుకువచ్చారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య ఊంజల్‌సేవ సాగింది. వెన్నెల కాంతుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న పవిత్రోత్సవాలు



ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: మండలంలోని తొండమనాడులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఉత్సవాల్లో పాల్గొన్ని స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించారు.

ముక్కంటిసేవలో దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ



కరికాల వలవన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వలవన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురంవద్ద శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ ఈవో సాగర్‌బాబు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

బాలగురునాథీశ్వరునికి రుద్రాభిషేక పూజలు



యాగ పూజలు చేస్తున్న వేదపండితులు

పాలసముద్రం: మండలంలోని రాచపాళెం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వర స్వామికి పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం రుద్రాభిషేక, యాగశాల పూజలు చేశారు. ఉదయం భక్తులు యాగశాలకు కావలసిన పూజాసామగ్రితో మంగళవాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించి స్వామివారికి సమర్పించారు. వేదపండితులు నవగ్రహ, శాంతి హోమపూజలు చేశారు. హోమం నిర్వహించిన కలస నీటితో స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం స్వామివారికి అభిషేకాలు చేసి సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ముగిసిన వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు



పురవీధుల్లో విహరిస్తున్న వేణుగోపాలస్వామి

కార్వేటినగరం: వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు కనులపండువగా ముగిశాయి. బుధవారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన వంటి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి మూల విరాట్‌ను పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు రు క్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు వేద మంత్రాల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింట కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధ్యక్షుడు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



అలంకరణలో గంగమ్మ



అలంకరణలో శివగంగై అమ్మ



అగ్గికుండలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

నగరి: స్థానిక కొత్తపేటలో గంగజాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. డప్పువాయిద్యాల మధ్య గంగమ్మ ఊరి మధ్యలో వేసిన వేపాకు గుడిసెకు వచ్చి చేరింది. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేపాకు సారెలు, వెయ్యికన్నుల దుత్తల్లో దీపాలు సమర్పించారు. తడిబట్టలతో అంగప్రదక్షిణ చేశారు. పసుపుదుస్తులు ధరించి అగ్గికుండలు చేతపట్టి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. జాతర ప్రాంతంలో కొలువుదీరిన భవాని, ఎల్లమ్మ, శివగంగై దేవతల అలంకరణ అందరినీ అలరించింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, వినూత్న ప్రదర్శనలు భక్తులను అలరించాయి. గంగమ్మను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కుంభం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి గంగమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి పొలిమేర దాటించారు.